# ఆకాంక్ష

రాత్రి వాన కురిసింది - చాలా కాలం తర్వాత యెవరో ముద్దు పెట్టుకున్నట్టు రాత్రి వాన కురిసింది. యెవరు?

దుప్పటిని మెడవరకు లాక్కుని

కప్పుకుంటూ పక్కకి తిరిగి ముడుచుకొని పడుకుంటూ 'యింత స్థిమితంగా ఆలోచించి యెంతో కాలమైంది' అనుకొంది ఆకాంక్ష.

చిన్నప్పుడు వర్షం వస్తే కాగితాల కోసం పరుగు పడవలు చేయమని పెద్దాళ్ల చుట్టూ తిరగటం. నీళ్లల్లోకి వదిలిన పడవలు మునిగిపోతోంటే చప్పట్లు. ఆరుద్రలని చేతుల్లోకి తీసుకోవాలనే వుబలాటం. ఆ కేరింతల బాల్యం నుంచి నిదానంగా యెక్కడికి చేరుకున్నట్టు?

. వర్షం పడినప్పటి మట్టివాసన గుండెల నిండా పీల్చుకోవటం. స్నోవైట్‌లో కూర్చుని ఐస్‌క్రీమ్ తింటూ కబుర్లే కబుర్లు. రెయిన్ డ్యాన్స్‌కి యెవరు పిలిచినా 'ఆ ఆర్టిఫీషియల్ వర్షంలోనైతే రాను. వర్షంపడినప్పుడైతే వస్తా' అని చెప్పటం. 'వానలో తడిస్తే యేమైనా వుందా? జలుబు చేయదూ' అంటూ కుర్రాళ్ల జ్ఞానపలుకులు వినటం. జలుబా? విక్స్ కోల్డరిన్ వున్నాయనే యాడ్ ప్రపంచపు అంచులకి.

వురుము శబ్దం వినిపించగానే పిడుగు పడినంత బెదిరి చెవులు రెండూ చేతివేళ్లతో గట్టిగా మూసేసుకుంటూ 'అర్జునా ఫల్గుణా' గబగబా పఠించేటం.

పిడుగు నుంచి అర్జునుడు రక్షిస్తాడా? యేమో! అప్పుడేం తెలుసు. తాతగారు వల్లె వేయించిన శతకోటి మంత్రాల్లో అదొకటి. పఠించకపోతే పిడుగులు పడతాయనే భయం.

ఆరవుతోంది. లేవగానే కాఫీ తాగటం అలవాటు. తాగకపోతే యేమైతుంది? తలనొప్పి వస్తుందనే భయం.

చేయి చాపి రిసీవర్ అందుకుంది. రూం సర్వీస్‌కి కాల్ చేసి కాఫీ ఆర్డర్ చేసింది.

దుప్పటి పక్కకి తోసి మంచం దిగింది. కిటికీ దగ్గరకి వెళ్లింది. కర్టెన్ పక్కకి లాగింది. ఫ్రెంచ్ విండో అద్దం నిండా వర్షపు అద్దకపు తెరలు. పచ్చని పలకరింపు.

ఆవలింత. బద్ధకంగా వొళ్లు విరుచుకొంటూ వచ్చి కాళ్లు టీపాయ్ మీదకి చాపిమెడని సోఫా వెనక్కి వాల్చి కూర్చుని కనురెప్పలు మూసుకుంది.

'వర్షం అంటే యెందుకంత యిష్టం'

'యెప్పుడొస్తుందో తెలియదు కదా'

'వాతావరణం కాలమ్ చూస్తే తెలుస్తుంది కదా!'

అవునా? నిజమేనా? యేది యెప్పుడు యెందుకొస్తుందో యేం తెస్తుందో,

తీసుకురాదో కాలమ్‌లో తెలిసిపోతుందా...

తల గట్టిగా విదిల్చింది.

కాఫీ వచ్చింది.

'కాఫీ యిష్టం కదా. కమ్మగా కాఫీ చేయటం నేర్చుకోవచ్చుగా' వో సలహా.

'యెందుకిలా? యివి యేవీ వద్దనుకున్నానుగా' తల విదిల్చింది.

సమయం దొరికింది. పైగా రాత్రి వర్షం పడింది. తెల్లార్నే చల్లగాలి. తేనెపట్టు కదల్టానికి యెంత తాకిడి కావాలి.

ఫోన్ మోగుతోంది.

'హలో'

'గుడ్ మార్నింగ్'

'మార్నింగ్' అని అటుపక్క యెవరో అర్థంకాక మౌనంగా వుండిపోయింది.

'అయామ్ రోహిత్' అటునుంచి విన్పించింది.

'వో ఐ సీ'

రాత్రి యేర్‌పోర్ట్‌లో బ్యాగేజ్ కలెక్ట్ చేసుకొనే దగ్గర చిన్ని పరిచయం. యిండియా నుంచి లండన్ వెళ్లిపోయి వుద్యోగం చేస్తున్నాడంట. కాన్ఫరెన్స్‌కి వచ్చాడంట. అతనికీ యిదే హోటల్లో అకామిడేషన్ యిచ్చారు.

'రెడీ అవుతున్నారా?' అడిగాడు.

'యింకా చాలా టైమ్ వుంది కదా'

'వాక్‌కి వెళ్దాం వస్తారా? అమెస్టార్‌డామ్‌లో నడక చాలా బాగుంటుంది. పోయినసారి వచ్చినప్పుడు భలే యెంజాయ్ చేసాను' చెపుతున్నాడు రోహిత్.

మూడురోజుల కాన్ఫరెన్స్ - ప్రపంచవ్యాప్తంగా మార్కెటింగ్ విషయాలపై - యింతలో యెంత హడావుడి. యెంత ఆరాటం. యెంత అన్వేషణ. కొత్త పరిచయాలు - దాహార్తి హృదయాలని సేద తీరుస్తాయా... రెండ్రోజుల పరిచయం యేమిటి యీ స్టేషన్‌లో యెక్కి ఆ స్టేషన్‌లో దిగే ప్రయాణంలో యెంత వెతుకులాట... మరి అన్నేళ్ల ,పరిచయం స్నేహం... ప్రేమ... వాట్ నాట్...

'యేయ్ యేయ్ భాయి సాబ్' మూసుకోబోతున్న లిఫ్ట్‌డోర్స్ మధ్య నుంచి చప్పున లోపలికి వచ్చింది ఆకాంక్ష.

'మీకెన్నిసార్లు చెప్పాలి? అలా రావొద్దని. చాలా డేంజర్' విసుకున్నాడు లిఫ్ట్ బాయ్.

'నిజమే. డేంజర్. అంతకంటే డేంజర్ టైమ్‌కి ఆఫీసులో లేకపోతే. యీ రోజు కొత్త మేనేజర్ వస్తున్నాడంట. యీ లిఫ్ట్ తిరిగి మళ్లీ కిందకి రావడానికి బోల్డంత టైమ్ పడుతుంది. వొకటా రెండా యెనిమిది అంతస్తులు. యెక్కే వోపిక వుంది కానీ టైమ్ లేదు'

'త్వరగా బయలుదేరొచ్చుగా'

'యెక్కడా? సెకండ్‌షోకి వెళ్లి యింటికి వచ్చానా. పడుకోవాలి అనుకుంటుండగా నా ఫ్రెండ్ ఫోన్ చేసింది. తనకి మొత్తం సినిమా అంతా చెప్పి పడుకునేసరికి వుదయం త్వరగా తెలివి రాలేదు. అదీ ఆలస్యం' అంది.

'యే సినిమా'

'సప్నే'

'కాజోల్ యెలా వుంది మేడమ్'

లిఫ్ట్ యెనిమిదో అంతస్తులో ఆగింది. డోర్ తెరుచుకుంటుండగానే ఆకాంక్ష మిగిలిన వాళ్లందరి కంటే ముందు వొక్క వుదుటన బయటకి వస్తూ 'వెన్నెల స్వప్నంలా' అంటూ తన ఆఫీసు వైపు వెళ్లింది.

'గుడ్ మార్నింగ్ మేడమ్' పి.యే చెప్పాడు.

'మార్నింగ్... మార్నింగ్. కొత్త జి.యమ్ గానీ వచ్చారా?'

'యింకా రాలేదండి'

'డిజియమ్'

'వచ్చారు. డిపార్ట్‌మెంట్‌లో అందరూ వచ్చేసారు'

అతనితో మాట్లాడుతూనే తన క్యాబిన్‌లోకి వెళ్లిపోయింది.

కుర్చీలో కూర్చుంటూ పర్సనల్ కంప్యూటర్ ఆన్ చేసింది. ప్రొడక్షన్ డిస్పాచ్ సేల్స్ రిపోర్ట్స్ చూసింది.

సేల్స్ రిపోర్ట్ చూస్తూ 'నెలాఖరు వచ్చేస్తుంది టార్గెట్‌కి రీచ్ కావల్సింది వుంది కదా! సేల్స్ రిప్రజెంటేటివ్స్ రివ్యూ మీటింగ్ పెడితే'... వెంటనే యింటర్‌కమ్‌లో పి. యే.కి మీటింగ్ వివరాలు చెప్పి అరేంజ్‌మెంట్స్ చేయమంది.

తిరిగి యింటర్‌కమ్ మోగింది.

'పదకొండు గంటలకి మినీ హాల్లో జి.యమ్. తో పరిచయం చిన్న గెట్ టూ గెదర్' పర్సనల్ ఆఫీసర్ చెపుతున్నాడు.

'ష్యూర్' అంటూ వాచ్‌వైపు చూసింది యింకా పదిహేను నిముషాలుంది.

టైమ్ అయ్యే వరకు పనిచేస్తూనే వుంది. మినీహాల్‌కి వెళ్లే సరికి పదకొండు అయింది.

పరిచయాలు అవ్వగానే జి.యమ్.ని మాట్లాడమన్నారు పర్సనల్ ఆఫీసరు.

'వొక్కో డిపార్ట్‌మెంట్‌కి వొక్కో గోల్ వుంటుంది. మన మార్కెటింగ్‌కి వో టార్గెట్ వుంది. మన గోల్ ఆ టార్గెట్ రీచ్ కావటం. యెలా ఆ టార్గెట్ చేరుకున్నారు అనేదానిమీద నాకేమంత ఆసక్తి వుండదు. టార్గెట్ చేరుకున్నారా లేదా అన్నదే ముఖ్యం. ఫర్ ఎగ్జాంపుల్ సెకెండ్ షో సినిమా చూసి ఆపై ఆకథ మరో ఫ్రెండ్‌కి ఫోన్‌లో వినిపించి ఆలస్యంగా నిద్రలేచినా మూసుకు పోతున్న లిఫ్ట్‌లోకి దూరి పోయి... యిలా యేం చేసినా పర్లేదు కాని ఆఫీసుకి టైమ్‌కి చేరుకున్నారా లేదా అన్నదే ముఖ్యం అటువంటి వాళ్ళు ఖచ్చితంగా వాళ్ళ టార్గెట్‌ని సునాయాసంగా రీచ్ అవుతారు. అటువంటి పనిమంతులని యిష్టపడతాను. యస్ ఐ లైక్ దెమ్' అంటూ ఆకాంక్ష వైపు చూసి మెరుస్తున్న కళ్లతో చిన్నగా నవ్వాడు ముప్ఫైమూడేళ్ల నిహార్.

టీ స్నేక్స్ సర్వ్ చేస్తున్నారు.

ఆకాంక్ష అతని వైపు తిరిగి చూడకుండా వుండటానికి చాలా కష్టపడింది.

'ఆరోజు లిఫ్ట్‌లో నేనూ వున్నాను. అడ్డూ ఆపు లేకుండా మాట్లాడే యీ పిల్ల ఆఫీసులో పనేంచేస్తుందీ అనుకున్నాను. కానీ ఆకాంక్ష ఆ రోజు ఆఫీసులోకి వస్తూనే మార్కెటింగ్ మేనేజర్స్ పర్సనల్ టార్గెట్ డేటా చూశాను. ఆకాంక్ష మంచి మేనేజర్ అనుకున్నాను. మీటింగ్‌లో మిమ్మల్ని చూసాక లిఫ్ట్‌లో లొడలొడా వాగే పిల్లేనా ఆకాంక్ష అని తెగ ఆశ్చర్య పోయాననుకో. నెలరోజులుగా మీ పెర్ఫామెన్స్ చూస్తున్నాను కదా సింప్లీ సూపర్బ్. కానీ ఆకాంక్ష మన డిపార్ట్‌మెంట్ అనుకున్న టార్గెట్‌కి రీచ్ కావడం లేదు. యెలా యీ డిపార్ట్‌మెంట్‌ని వో దారికి తీసుకు రావాలో తెలియటం లేదు డి.జి.యమ్ మీకు బాగా తెలుసా' వేడివేడి సూప్‌ని సిప్‌చేస్తూ అడిగాడు నిహార్.

'డి.జి.యమ్..' వో నిమిషం తటపటాయించి 'బాగా తెలియదు కానీ

తెలుసు అతనికి విఠల్ వాళ్లు బాగా దగ్గర. నిజానికి మీ పోస్ట్ కోసం డి.జి.యమ్ బాగా ట్రై చేశారు' అని చప్పున మాటలు ఆపేసింది.

'యిదేంటి యిలా మాట్లాడుతున్నాను యిలా యిప్పటివరకు యెప్పుడు యెవరి దగ్గరా యెవరి గురించి మాట్లాడలేదే. నిహార్ మాటల్లో యేదో మ్యూజిక్ వుంది. నో నేనిలా మాట్లాడకూడదు' అతని వైపు చూడకుండా టేబిల్ మధ్య వాజ్‌లో వున్న లిల్లీపూల వైపు చూస్తూ ఫోర్క్‌తో నూడుల్స్ తీసుకొని నోట్లో పెట్టుకుంది.

'మీకు లిల్లీస్ యిష్టమేనా' అడిగాడు నిహార్

'వూ భలే పరిమళం కదా' అంది.

'యీ ఇయర్ లిల్లీ పువ్వుల ఎక్స్‌పోర్ట్ మీద షే కంపెనీస్‌కి మంచి లాభాలు వచ్చాయి' అన్నాడు.

'అవును పోయిన యేడాది కూడ వాళ్ళే కదా ఎక్స్‌పోర్ట్‌లో టాప్' అంది.

రెస్టారెంట్‌లోని దీపాల వెలుగు లేతగా ఆమె బుగ్గలపై మెరుస్తోంది.

'మీరు నాకు భలే నచ్చారు. కేవలం మీరు అందంగా వుంటారనే కాదు. బ్యూటీ ఆఫ్ యువర్ మైండ్. ఐ యామ్ సారీ మిమ్మల్ని అలా డి.జి.యమ్. విషయం అడక్కూడదు కానీ కొన్నిసార్లు ప్రొఫెషన్‌లో మనం యేమిటో కానీ యీ రీతిగా కూడా బిహేవ్ చెయ్యాల్సి వస్తుంది. నాకు తెలుసు మిమ్మల్ని యిబ్బంది పెట్టానని' మృదువుగా అన్నాడు.

'నో...నో... అలా యేం లేదు. డిజియమ్ వర్క్‌ని హేండిల్ చేసే పద్ధతివేరు. యిక్కడ నే జాయిన్ అయి కూడా యెక్కువ కాలం కాలేదు. మీకు తెలుసుగా యిది నాఫస్ట్ జాబ్. విఠల్ వాళ్లకి కానీ, డి.జి.యమ్.కి కాని యే పని త్వరత్వరగా చేసైటం యిష్టం వుండదు. అలా చేసేస్తే మన అవసరం పైవాళ్లకి యేం వుండదంటారు యిన్‌సెంటీవ్స్ కూడా తక్కువని అనుకుంటారు. అసలు యీ ఆఫీసులో మన సెక్షన్ వొక్కొక్కరూ వొక్కోలా వుంటారు అందర్నీ వొకేలా హేండిల్ చేయలేం..' అంటూ ఆమె చెపుతూనే వుంది.

నిహార్ నవ్వుతూ జాగ్రత్తగా వింటున్నాడు

రెండు నెలల్లో నిహార్‌కి మేనేజ్‌మెంట్‌తో మంచి ర్యాపోర్ట్ పెరిగింది. ఆకాంక్ష మిగిలిన ప్రపంచాన్నంతా మర్చిపోయి కేవలం నిహార్ కోసమే పనిచేస్తున్నట్టు పనిచేస్తోంది.

ఆరోజు నిహార్ చెప్పాపెట్టకుండా ఆకాంక్ష యింటికి వచ్చాడు.

అతనొచ్చేసరికి ఆమె తల స్నానం చేసి జుట్టు ఆరపెట్టుకుంటుంది.

'మీది భలే సిల్కీ హెయిర్' అన్నాడు.

'థ్యాంక్ యూ'

అతనికి యేమి యివ్వాలో తాగటానికి అర్థం కాక కూల్‌డ్రింక్ ఆఫర్ చేసింది.

'బాగా చల్లగా వుంది. మీకు కాఫీ యిష్టం కదా కాఫీ తాగితే యెలా వుంటుంది' అన్నాడు.

'బాగుంటుంది కానీ నే చేస్తేనే బాగుండదు.

'అదేంటి మీకు కాఫీ చేయటం రాదా'

'రాదుకదా'

'అంతిష్టం కదా, చేయటం నేర్చుకోవచ్చుగా'

'యిష్టమైనవన్నీ నేర్చుకోవాలా యేంటి?'

'తాగాలనిపిస్తే'

'దొరికే చోటకి వెళతా'

'యెందుకంత శ్రమ'

'యిష్టమైన వాటికోసం వెళ్లటంలో శ్రమ యేం వుంటుంది పైగా బోల్డంత యెగ్జయిట్‌మెంట్ వుంటుంది. దొరుకుతుందా లేదా దొరికినా మనం అనుకున్నంత కమ్మగా వుందా లేదా యిలా అనేక రకాలుగా'

'మీ దగ్గరకి వస్తూ నేనూ అంత ఎగ్జయిట్ మెంట్ పొందా మీరుంటారా వుండరా? చెప్పకుండా వస్తున్నాను మీ ప్రైవసీని కొల్లగొడుతున్నానేమో... అయినా పర్లేదు చూడాలనిపించినప్పుడు చూసైటమే అనుకొంటూ వచ్చాను. బట్ మీరు నన్ను బాగా రిసీవ్ చేసుకున్నారు. నే కాఫీ కలిపి యిస్తా' చొరవగా కిచెన్‌లోకి వెళ్ళాడు.

అతను కబుర్లు చెపుతూ కాఫీ కలిపాడు.

అతను కాఫీ అందిస్తుంటే అందుకొంటూ 'థ్యాంక్‌యూ' అంది.

సిప్ చేసి 'చాలా బాగుంది' అంది.

'థ్యాంక్‌యూ మీకు నచ్చేట్టు కాఫీ చేయగలిగినందుకు'.

'రేపు సాయంత్రం యం.డి.కి. సేల్స్ ప్రమోషన్‌కి మనం యేమేమి చేస్తామో రాసి ఆనోట్ యివ్వాలి. మీరు ప్రిపేర్ చేసి రేపు ఆఫీసుకి రాగానే చూపిస్తే నేనూ అందులో నా ఐడియాస్ కూడా కలిసి ఫైనల్ నోట్ యిచ్చేస్తా' అన్నాడు.

'ష్యూర్'

'బై గుడ్‌నైట్'

వెళ్ళాలనుకున్న సెకండ్ షో సినిమాని వదిలేసి పర్సనల్ కంప్యూటర్ ముందు కూర్చుంది ఆకాంక్ష.

వసంతకాలపు తొలి జల్లుల మేఘాల వాయిద్యం - ఆకాంక్ష బయటకి వచ్చింది అలా తడుస్తూ నిహార్ యింటికి వచ్చింది.

'అరే అలా తడిచిపోయారేంటి'

'కమాన్ రండి. బయటకి వర్షం భలే వుంటుంది' అంది.

'యెందుకలా? జలుబు చేయదా? అయినా వర్షం వస్తున్నప్పుడు కేర్‌ఫుల్‌గా వుండొద్దా'

'యెలా వుంటాం? అసలు వర్షం వస్తుందని ముందుగా యెలా తెలుస్తుంది' అడిగింది.

'వాతావరణం కాలమ్ చూస్తే'

'కాలమ్ చూస్తే అన్నీ తెల్సిపోతాయా? రాశి ఫలితాలు చూసి కాని కాలు కదపరా యేంటి' అంటూ బాల్కనీలోకి వెళ్ళింది.

మేఘ గర్జనకి వులిక్కిపడుతూ 'అర్జునా ఫల్గుణా' పఠిస్తూ ముఖాన్ని ఆకాశం వైపు యెత్తింది. జల్లులు జల్లులుగా ముఖానిపై వాన.

నిహార్ చప్పున ఆమెని దగ్గరకి తీసుకొని మోహపు ముద్దొకటి పెదవులపై అద్ది 'వర్షంతో తడిస్తే ముఖానికి కొత్త అందం వస్తుందని యిప్పటి వరకు గమనించలేదు' అన్నాడు.

'వానముద్దు యింత మోహనంగా వుంటుందని నాకు యిప్పటివరకు తెలీదు' నవ్వుతూ అంది.

* * *

ప్రేమ యింత సంబరంగా వుంటుందా - అప్పుడప్పుడు ఆకాంక్ష

ఆశ్చర్యపోతూ అంతలోనే 'నిన్న యీ కలవరింతా లేదులే నేడు చిరుగాలి యేదో అందిలే' హమ్ చేస్తూ స్విమ్మింగ్ పూల్లోకి దూకినా డిస్కో ట్రాక్పై కదిలినా ఆమెని నిహార్ చూపుల స్పర్శా మాటల స్పర్శా తాకిన స్పర్శ హత్తుకునే వున్నాయి.

నిహార్ పని సామర్థ్యానికి యిన్సెంటివ్గా మేనేజ్మెంట్ అతనికి జెన్ కారు యిచ్చింది.

మూడు రోజులు కలకత్తా వో.డి. మీద వెళ్ళింది ఆకాంక్ష. అక్కడ్నుంచి నిహార్కి రోజూ ఫోన్ చేసి 'హాయ్' చెపుతుంది. లాంగ్ డిస్టెన్స్ కాల్ అని కూడా తటపటాయించకుండా యెక్కువసేపే మాట్లాడేది.

ఆరోజు ఆమె ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా ఆఫీసుకి వస్తూనే నిహార్ ఛాంబర్లోకి వెళ్ళింది.

నిహార్ ముందు వో అమ్మాయి కూర్చుని వుంది.

'హాయ్' అన్నాడు.

ఆ పలకరింపులో యెప్పటి తన్మయత్వం లేదు.

'ఆకాంక్ష - మందిరాశర్మ మన డిపార్ట్మెంట్లో జాయిన్ అయ్యారు' వొకరినొకరికి పరిచయం చేశాడు.

'హలో' అంది మందిర

'హాయ్' చిర్నవ్వుతో అంది ఆకాంక్ష

వాళ్ళిద్దరూ మౌనంగా వుండిపోయారు. ఆకాంక్షకి యేం చెయ్యాలో తెలియక 'మళ్ళీ కలుస్తా' అని చెప్పి బయటకి వచ్చేస్తుంటే నిహార్ గట్టిగా నవ్వుతూ మందిరాతో మాట్లాడుతున్నాడు.

ఆ నవ్వు ఆకాంక్షకి తెలుసు. ఆకాంక్ష పరిచయమైన కొత్తలో ఆమె దగ్గర నవ్విన నవ్వే ఆ నవ్వు.

* * *

మ్యాజిక్ మాయమయింది.

నిహార్ ఆకాంక్షని యిగ్నోర్ చేయటం స్పష్టంగా ఆఫీసులో బయట తెలుస్తూనే వుంది. ఆ స్థానంలో మందిర మెదలటం అందరూ చూస్తూనే వున్నారు.

ఆకాంక్ష నిహార్‌ని కలిసి చాలా విషయాలు మాట్లాడాలని ప్రయత్నిస్తూనే వుంది. అతను ఆమెకి ఆ అవకాశం యివ్వటం లేదు.

ఆకాంక్ష తనలో సుడులు తిరుగుతున్న బాధ నుంచి యెలాగైనా బయటపడాలని ఆలోచించి సైకాలజిస్ట్ తనూజా గుప్తాకి కాల్ చేసి అపాయింట్‌మెంట్ అడిగింది.

'రేపు సాయంత్రం ఆరుగంటలకి యింటికి రా ఆకాంక్షా. మనం మాట్లాడుకుందాం' అందామె.

* * *

'ఆకాంక్ష! యెందుకలా వర్రీ అవుతావ్? యిదంతా వో ఆట. అప్పుడే మనకి యింపార్టెన్స్ వుందనిపిస్తుంది అంతలోనే మనం యేం కావనిపిస్తాం' అంది తనూజా గుప్త.

'ఆఫీసులోనే కాదు. యింతవరకూ పెళ్ళి అని వో సారి లివింగ్ టుగెదర్ అని బోల్డన్నిసార్లు నాతో మాట్లాడాడు. అలాంటి యింప్రెషన్ తన ఫ్రెండ్స్ సర్కిల్లో కూడా యిచ్చాడు. యిప్పుడు నిహార్ ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. అలాగని అతను పూర్తిగా మామధ్య యేం లేదన్నట్టు కూడా లేదు. యింకేం లేదనే నమ్మకం పూర్తిగా నాలోకి యింకుతుండగా తిరిగి యేదో వో చిన్నమాట అంటాడు. అంతే మా స్నేహం తిరిగి కంటిన్యూ అవుతుందనిపిస్తుంది' అంది ఆకాంక్ష.

'అతను నీతోనే అలా వుంటాడా? అందరితోనూ అలానే వుంటాడా?'

'అతను పరిచయం అయిన కొత్తలో అతని జీవితంలో నేను చాలా యింపార్టెంట్ అనేట్టుండేది అతని ప్రవర్తన. అయితే అది నిజం కాదు. బ్రాంచ్ ఆఫీసుల్లో పని చేస్తున్న ముగ్గురు అమ్మాయిలతో అతని ప్రవర్తన అలానే వుంది. యివన్నీ తెలుస్తున్నా అతన్నుంచి దూరం కాలేకపోతున్నా' చెప్పింది.

తనూజ తన ముందున్న పేపర్ వెయిట్‌ని చేతుల్లోకి తీసుకొని అటూ యిటూ కదుపుతుంది. హృదయాకారంలో వున్న ఆ వెయిట్‌లోని ఫ్లూయిడ్‌లోని రంగురంగుల గోళీలు అటూ యిటూ మెల్లగా కదుల్తున్నాయి.

'నిన్న మొన్నటి వరకు మా అమ్మాయిలమంతా నవ్వుతూ పలకరించుకునే వాళ్ళం. వర్క్ విషయం మాట్లాడేవాళ్ళం. బట్ నిహార్ స్నేహం అభిమానం

అందరివైపు వుండడంతో మేమంతా వొకరివైపు మరొకరం బిట్టర్‌గా చూసుకుంటున్నాం. మందిరా నా జూనియర్. మామధ్య వర్క్ విషయంలో మాట్లాడాల్సినవి చాలా వుంటాయ్. కాని మా యిద్దరి మధ్యా మాటలే లేవ్. నీతో నాకేం పని అన్నట్టు ఆమె నన్నేం కన్సల్ట్ చేయదు. డైరెక్ట్‌గా నిహార్‌తోనే డీల్ చేస్తుంది. దీంతో మిగిలినవాళ్ళు వాళ్ళిష్టం వచ్చినట్టు బిహేవ్ చేస్తున్నారు. బ్రాంచ్ ఆఫీసులోని పరిస్థితి యిలానే వుంది. డిసిప్లెనే పోయింది డిపార్ట్‌మెంట్‌లో. మనం యిలా వుండక్కర్లేదు అని వాళ్ళతో మాట్లాడాలనిపిస్తుంది కానీ యెలానో తెలియదు' అంది ఆకాంక్ష.

'నువ్వో విషయం చెప్పు. నీకు వో సంస్థలో శక్తిసామర్ధ్యాలు కల ప్రముఖ వ్యక్తివి కావాలని వుందా? లేదా వో ప్రముఖ వ్యక్తికి భార్యవో వో ముఖ్యమైన వ్యక్తివో కావాలని వుందా' అడిగింది తనూజా గుప్త.

ఆకాంక్ష బిట్టర్‌గా నవ్వి 'అలా యెలా వేరుగా వుంటాయి' అంది.

'యస్ ఆకాంక్షా! నీకెప్పుడూ చెప్పలేదు కదా. నేనూ మీ అన్నయ్య యెందుకు విడిపోయామో. మీ అన్నయ్యకి నాకు యూనివర్శిటీలోనే పరిచయం. నిహార్ తన పొజిషన్ గట్టిపర్చుకోటానికి నన్నూ ఆ తర్వాత మందిరాశర్మని యెలా ఉపయోగించు కోవాలనుకుంటున్నాడో మీ అన్నయ్య అలాంటి పవర్ నాపై ప్లే చేశాడు. కొంతకాలం భరించాను. అతను నాకెరీర్‌కి అడ్డం. స్నేహంలో కూడా అతనికి నేను యింపార్టెంట్ కాదు. యివి క్లారిఫై అయ్యాక యింకా అతనితో కంటిన్యూ అవ్వటానికి నాకే పాయింటూ కనిపించలేదు. ఆ స్నేహం నుంచి నేను తప్పుకున్నాను. అయితే నీది నా అంత సింపుల్ విషయం కాదు. రోజూ ఆఫీసులో అతనితో వర్క్ చెయ్యాలి. అదే డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న మిగిలిన స్త్రీలకి పర్సనల్‌గా అఫిషియల్‌గా అతను యిచ్చే ప్రాముఖ్యతని చూస్తుండాలి. ఆ స్త్రీలు నిన్ను నిర్లక్ష్యం చేస్తుంటే భరించాలి. అతన్నుంచి నువ్వు విడిపోవటానికి చాలినన్ని బిట్టర్ ఎక్స్‌పీరియెన్స్‌లు నీకున్నాయి. కానీ నువ్వు విడిపోలేవు. యిందులోంచి బయటకి రాలేవు. యిందుకంటే నువ్వు నీ నుంచి విడిపోయి అవుటాఫ్ ది వే వెళ్ళి అతని ప్రేమని నమ్మావు. ప్రేమించావు. అతను నీ మీద ముందు చూపించినంత ప్రేమనో యిష్టాన్నో తిరిగి చూపించాలని అనుకుంటున్నావ్ దానికోసం నువ్వు చాలా ఎఫెర్ట్ పెట్టావ్. చాలా ఎనర్జీస్‌ని ఖర్చు చేశావ్. నువ్వు పడుతున్న బాధే నీకు యేదో రోజు చికాకుని తెప్పిస్తుంది లేదా యేదో రోజు నీకు యేదో వో గొప్ప ఆనందాన్నిచ్చే నమ్మకం నీకెదురవుతుంది. అలాంటి యేదో వొక సందర్భంలో

నువ్వు యీా స్థితి నుంచి బయటకి వచ్చేస్తావ్. అప్పటివరకూ నీకీ నరకం తప్పదు. నిహార్ లాంటి వాళ్ళు యెన్నాళ్ళో యిలా రాణించలేరు. వాళ్ళు వాళ్ళ ప్రవర్తనని మార్చుకోలేరు' అంది తనూజా గుప్త.

'యేమో! చూస్తాను. రెండ్రోజుల్లో మేం కాన్ఫరెన్స్‌కి అమ్‌స్టర్‌డామ్ వెళుతున్నాం. యీా ట్రిప్‌లో అతనితో మాట్లాడడానికి వీలవుతుందను కుంటున్నా'.

'యెలా '

'వెళుతుంది మా యిద్దరమే'

'యిన్విటేషన్ మీ యిద్దరికి వచ్చిందా'

'వూ'

'నువ్వింకా చాలా చిన్నపిల్లవి. నీకు బోల్డంత ఫ్యూచర్ వుంది. డోంట్ వర్రీ టూ మచ్. కానీ నిన్నో విషయంలో కంగ్రాట్ చెయ్యాలనిపిస్తుంది. నీది చాలా ముచ్చటైన ప్రేమ. ప్రేమించటం, ప్రేమించే వాళ్ళని రిసీవ్ చేసుకోవటం నీకు తెలుసు. నీ ప్రేమని అతను గుర్తించలేదనుకోకు. గుర్తించినా కావాలని నిర్లక్ష్యం చేస్తారు. వీళ్ళు యింకా యెక్కడికీ పోలేరని నమ్ముతారు. అది అతని పర్సనాల్టీకి సంబంధించిన విషయం. చూడు అమ్‌స్టర్‌డామ్ వెళుతున్నారు కదా. ఎప్‌లిక్స్ విచ్చుకునే సీజన్ బ్యూటిఫుల్ సీజన్. ఐ హోప్ నీకు ఆనందం యిచ్చే విషయాలేమైనా జరుగుతాయేమో ఆల్ ది బెస్ట్' చెప్పింది తనూజా గుప్త.

* * *

యింటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో మందిరాశర్మని చూస్తూనే ఆకాంక్షకి ఆమె కూడా కాన్ఫరెన్స్‌కి వస్తున్నట్టు అర్ధమైపోయింది.

'యిన్విటేషన్ లేదు కదా' అనుకుంది ఆకాంక్ష

ఆకాంక్ష నిహార్ మందిరా వరసగా కూర్చున్నారు.

ఫ్లైట్ టేకాఫ్ అయింది. మందిరా నిహార్ మాట్లాడుకుంటున్నారు. ఆకాంక్ష మ్యూజిక్ వింటుంది. కాని మనసు నిలవడం లేదు. బయట శూన్యాన్ని డామినేట్ చేస్తూ ఆమెకి యికముందంతా శూన్యం తప్ప మరొకటి లేదా అనిపిస్తుంది. అగాధాల్లోకి జారిపోతానన్నట్టు మగత నిద్ర... జారిపోతుంది చీకటి అగాధాల్లోకి... వులిక్కిపడి లేచింది ఆకాంక్ష.

భయంతో తత్తరపాటుతో ఆమె శరీరం వణికిపోతోంది. ఆమె చప్పున పక్కనున్న నిహార్ చేతిని పట్టుకుంది.

అతను చప్పున ఆ చేతిని విడిపించుకోబోయాడు.

'నిహార్ ప్లీజ్! భయంగా వుంది' అంది ఆకాంక్ష.

'ప్లీజ్ మందిరా! నన్నొదిలై'

ఆకాంక్ష అతని చేతిని వదిలేసింది.

* * *

అమ్‌స్టర్‌డామ్‌లో ఫ్లైట్ లాండ్ అయ్యేవరకూ ఆకాంక్ష సమస్త ప్రపంచాన్ని మర్చిపోయింది. బాధ... చికాకు డెలిగేట్స్‌ని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన వాళ్ళ పలకరింపులని యెలా రిసీవ్ చేసుకుందో కూడా ఆమెకి గుర్తులేదు. మందిరా నిహార్ యెటు వెళుతున్నారో యెక్కడ వుంటున్నారో యివి యేవీ ఆమె పట్టించుకోలేదు. ఆర్గనైజర్స్ తీసుకువెళ్ళిన హోటల్ రూంలోకి వెళ్ళి వెంటనే తలుపు వేసేసుకుని పక్కపై వాలిపోయింది. అప్పటివరకు వుగ్గపెట్టుకున్న దుఃఖం ఆగలేదు. యేడ్చియేడ్చి నిద్రపోయింది.

ఫోన్ మోగుతోంది.

ఆమె కాసేపు అలానే కూర్చుండిపోయింది. ఫోన్ మోగటం ఆగింది. వో సెకన్ తర్వాత తిరిగి మోగటం మొదలయింది.

ఆకాంక్ష మెల్లగా రిసీవర్ అందుకుని 'హలో' అంది.

'యీ రోజు మనం సబ్‌మిట్ చెయ్యాల్సిన ప్రపోజల్స్ రెడీగానే వున్నాయి కదా' అడిగాడు నిహార్.

'యస్ సర్! మీరోసారి చూస్తారా' అడిగింది ఆకాంక్ష

'నేనేం చూడను. అవన్నీ నువ్వే చూసి పట్టుకొచ్చెసై' అన్నాడు.

'వో యస్' అంది.

అతను రిసీవర్ క్రెడిల్ చేశాడు.

మొదటిరోజు కాన్ఫరెన్స్‌లో ఆకాంక్ష ప్రిపేర్ చేసిన ప్రపోజల్స్ ప్రెజెంట్ చేసి నిహార్ చాలామంది దృష్టిని ఆకర్షించాడు.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఆ కాన్ఫరెన్స్‌లో కనిపిస్తున్న స్త్రీలంతా బాస్‌ల

వెంటవచ్చిన వాళ్ళు. పేపర్స్ ప్రపోజల్స్ ప్రెజెంట్ చేయటానికి సహకరిస్తున్న వాళ్ళే.

ఆరోజు ఆర్గనైజర్స్ అరేంజ్ చేసిన డిన్నర్‌కి ఆకాంక్ష వెళ్ళేసరికి రోహిత్ ఆమె కోసం వెదుక్కుంటున్నాడు ఆమెని చూడగానే దగ్గరకు వచ్చి 'యిండియా యెలా వుంది' అడిగాడు.

'యెందుకంత బెంగగా అడుగుతున్నారు. శాటిలైట్ ఛానల్స్ యింటర్‌నెట్ యిన్నుండగా' అంటూ పక్కనున్న మరో డెలిగేట్ నవ్వాడు.

'అన్నీ వుంటాయి కానీ నాదేశం విషయాలు నా దేశస్థురాలు చెపుతుంటే వినటంలో నాకెక్కువ ఆసక్తిగా వుంటుంది' అంటున్నాడు.

నిహార్ మందిరా హాల్లోకి వచ్చారప్పుడే.

'హాయ్ మందిరా' ఆకాంక్ష పలకరించింది.

మందిర కాస్త యిబ్బందిగా నవ్వి 'హాయ్' అంది.

రోహిత్‌కి యిండియా విషయాలు చెపుతూనే ఆకాంక్ష తన ఆలోచనల్లో తను కొట్టుకుపోతుంది.

రెండోరోజు కాన్ఫరెన్స్ మొదలవుతుంటే నిహార్ హడావుడిగా ఆకాంక్ష దగ్గరకి వచ్చాడు.

'యేమయ్యావ్ రాత్రంతా. నీకోసం ఫోన్ చేస్తూనే వున్నాను. వుదయం కూడా దొరకలేదు. యీ రోజు మనం పేపర్ సబ్‌మిట్ చెయ్యాలి కదా. దాని విషయం మాట్లాడదామని' విసుగ్గా అన్నాడు.

'యీరోజు పేపర్ విషయం మీరు యిండియాలో నాకేం చెప్పలేదే'

'మందిర యీ పేపర్ బాగా ప్రిపేర్ చేయగలదనే తీసుకొచ్చాను. యం.డి. కూడా వొప్పుకున్నారు. యిండియాలో బయలుదేరేముందు హడావుడిలో తనకి పేపర్ ప్రిపేర్ చేయటం కుదర్లేదు. నిన్నరాత్రి చేసేద్దాం అనుకున్నాం కానీ రాత్రి తనకి బాగులేదు. అందుకే నీకోసం ట్రై చేశాను. మనం పేపర్ అందరికంటే ఆఖర్ని ప్రెజెంట్ చేస్తామని చెపుతాను. నువ్వీలోగా రెడీచెయి మిగిలినవాళ్ళు చదువుతున్నవి నేవింటాను' అన్నాడు.

అనేకసార్లు నిహార్‌కి అప్పటికప్పుడు ఆకాంక్ష బోల్డన్ని పనులు చేసి పెట్టేది. అతనేం టెన్షన్ పడకుండా చాలా కంఫర్టబుల్‌గా వుండేట్టు ప్రతిక్షణం అతన్ని కనిపెట్టుకునే వుండేది.

'ఆకాంక్షా! ను...' అతని మ్యాజిక్ స్వరాన్ని ఆమె గమనించింది.

'సారీ సార్! నేనిప్పుడు ప్రిపేర్ చేయలేను. టైమ్ లేదు' అంది.

నిహార్‌కి ఆకాంక్షకి మధ్య యెంత స్నేహం పెరిగినప్పటికి ఆమె యేరోజు అఫీషియల్ టైమింగ్స్‌లో అతన్ని పేరు పెట్టి పిలవలేదు. పిలుపులో తేడా లేదు కానీ ఆమె చూపులో బోల్డంత తేడా. ఆ చూపుల్లో ప్రేమ లేదు బాధ్యత మాత్రమే వుంది.

'మీటింగ్ స్టార్ట్ అవుతుంది' అంటూ ఆమె లోపలికి నడిచింది.

ఫస్ట్ పేపర్ ప్రెజెంట్ చేయమని ఆకాంక్ష పేరు చదవగానే హాల్లోకి అప్పుడే వస్తున్న నిహార్ వున్నచోటే నిలబడిపోయాడు.

చదవటం పూర్తి చేసి ఆమె తిరిగి డయాస్ మీద నుంచి కదిలిందో లేదో హాల్ అంతా చప్పట్లు మృదువుగా వినిపించాయి.

ఆమె డయాస్ దిగి తన సీట్ దగ్గరకి వచ్చి కూర్చుంది.

ఐదు నిమిషాల తర్వాత ఆమెకో స్లిప్ అందింది. విప్పింది -

డియర్ మేడమ్,

మీ పేపర్‌లో ప్రెజెంట్ చేసిన వాటిల్లో నాలుగు పాయింట్స్ యింప్లిమెంట్ చేయడానికి మేం రెడీగా వున్నాం. మీకు యిష్టమైతే మీరు వొప్పుకుంటే వి.జి.కంపెనీస్‌కి మిమ్మల్ని జి.యమ్ మార్కెటింగ్‌గా అపాయింట్ చెయ్యాలనుకుంటున్నాం. మీ నిర్ణయాన్ని తెలియచేస్తారని ఆశిస్తూ.

- వి.కె.రనే

వి.జి.ఛైర్మన్, యు.కె.

ఆకాంక్ష కళ్ళ నిండా రంగురంగుల యెపిలిక్స్ విచ్చుకున్న సంబరం.

యస్. నో డౌట్. యిట్స్ ఎ బ్యూటిఫుల్ సీజన్.

సందేహమే లేదు యీ రుతువు చాలా అందమైనది.

♦